అప్పుడే పెద్దవానజల్లు కురిసి వెలిసింది. మళ్ళీ కురవడానికి సిద్ధంగా మబ్బులు దట్టంగాకమ్మి వెలుతురు నంతా మెల్లిగా మింగేస్తున్నాయి.

రయ్యిమని వీస్తూన్న ఈదురుగాలి చలిపుట్టిస్తోంది. మనిషిని ఒణికించేస్తోంది.

దారంతా ఒకటే బురద. కాలుపెట్టిన చోటంతా జర్రున జారుతోంది. ఎగుడు దిగుడు ఎత్తుపల్లాలతో నిండి బురదమయంగా వున్న ఆ దారమ్మట మంగమ్మ అడుగులు చూసి చూసి వేస్తూ ఊతకర్ర సాయంతో ఎంతో జాగ్రత్తగా నడిచి వెళ్తోంది. ఏ క్షణాన జారిపడతానో అని భయపడుతూ ముందు కర్ర ఆనించి నేలగట్టిదనం చూసుకుని ఆ తరవాత అడుగులు వేస్తోంది.

కర్రమీద బరువుమోపుతూ నడుస్తూనే వెలుతురుకు చెయ్యి అడ్డం పెట్టుకుని అందినంత మేరకు చూపులు సారించింది. మొదట్లో వయసుభారంతో మసకబారిన ఆ కళ్ళకు ఏమీ కనిపించనేలేదు. ఆ తరువాత నిదానంగా, పరిశీలనగా చూసేసరికి కొంచెం దూరంలో ఒక కంచెవేసిన చేనూ, ఆ చేను మధ్యలో ఒక పాకా మసకమసకగా కనిపించాయి. ఆమెలో ఉత్సాహం ఉబికివచ్చింది. ముందే ఒణుకుతున్నట్లు కదలుతున్న ఆమె తల మరింత వేగంగా కదలసాగింది. చంకలో వున్న మూటను సరిగ్గా సర్దుకుంటూ ఉల్లాసంగా నడక సాగించింది

కంచె దగ్గరికి రాగానే ఆమె అడుగులు అప్రయత్నంగా ఆగిపోయాయి. పచ్చని తివాసీ పరచినట్టున్న ఆ చేనువంకచూస్తూంటే ఎందుకో ఆమె కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. ముడతలుపడిన తన సన్నటి వేలితో కళ్ళు తుడుచుకుని కంచెకున్న చిన్న వెదురుబద్దల తలుపును తోసుకుంటూ లోపలికి వెళ్ళింది. పాకదగ్గరికి వచ్చేసరికి ఆమె తనను తాను సర్దుకుని లోపలికి అడుగేయబోయింది.

పాకదగ్గర అడుగుల సవ్వడి విన్న పుల్లయ్య 'ఎవరది?'అన్నాడు లోపలినుంచే.

'నేనేలే...' అంటూ వొంగి లోపలికి వెళ్ళింది మంగమ్మ.

పుల్లయ్య ముసలిమొహం వికసించింది. గొంగళి కప్పుకుని కూచున్నవాడల్లా గొంగళిని ఒక్కసారి విదిల్చిపారేసి ఉత్సాహంగా చూశాడు ఆమెను

మంగమ్మ కర్ర మూలకానించి చంకలోని మూట కిందపెట్టి పుల్లయ్య దగ్గర కూర్చుంది.

అతన్ని ఆపాదమస్తకం పరిశీలనగా చూస్తూ ఆందోళనగా అంది. 'ఏటింతగా చిక్కిపోయావు?'

పేలవంగా నవ్వాడు పుల్లయ్య.

'లేదులేయే...సాలా రోజులకు సూత్తున్నావు గందా అందుకని అట్టా అనిపిత్తుంది నీకు' అన్నాడు.

మంగమ్మ ఏం మాట్లాడలేదు. కాసేపాగి 'కూడు తిన్నావా?' అని అడిగింది.

'ఇంకాలేదు.'

'అదేం...?'


'ఊళ్ళోంచి ఇంకా కూడు రాలేదు.'

'ఎవురట్టుకొత్తారు నీకు కూడు?'

'నా కోసమంటూ ఎవరూ పట్టుకురారు. ఎవరైనా ఇట్టా సేలకేసి వత్తుంటె ఆళ్ళనేత పంపిత్తారు.'

''ఇటు కేసి ఎవురూ రాకపోతేనో?''

ప్రశాంతం ప్రశ



# అగ్ని

శ్రీకంఠమూర్తి

మంగమ్మ గొంతులో ఆదుర్దా స్పష్టంగా కనిపించింది.

అట్టా ఎట్టాగవుతుందే? పొలాలన్నీ మన పొలానికవతలేగా వున్నాయి? రోజుకొక్కసారైనా ఎవరో ఒకిరు రాకపోతారా? ఆళ్ళ నేత పంపిత్తారు. అన్నాడు పుల్లయ్య.

'అంటె ... రోజుకొక్కసారేనా నీకు కూడు?' అని జాలీ, దుఃఖం అన్నీ ఒక్కసారిగా ముంచుకురాగా అంది మంగమ్మ

'ఒక్కపూటేం కాదుగాని, ముప్పూటల కూడూ కలిపి ఒక్కసారే పంపి చేత్తే దాని పని అయిపోతుందిగా? అని పుల్లయ్య పేలవంగా నవ్వాడు.

మంగమ్మ మనసు చివుక్కుమంది. మొగుణ్ణి వాళ్ళింతగా ఉపేక్షిస్తున్నారని ఆమె అప్పుడే తెలుసుకుంది.

కాసేపు ఏదో ఆలోచిస్తూ మౌనంగా కూర్చుంది మంగమ్మ.

కాసేపటికి పుల్లయ్యే అడిగాడు.

'ఇట్టా ఎక్కడికొచ్చావ్?'

బాగానే వుంది. ఎక్కడికో నేనెందుకొత్తా. నిన్ను సూద్దామనిపిత్తె ఇటే వొచ్చా...

ఇంటికాడ సెప్పే వచ్చావా?

'అమ్మో! సెపితె ఇంకేమైనా వుందా? అట్లా వెళ్ళి పొలంగట్టున గడ్డికోసుకొత్తానని సెప్పి వొచ్చా...

అంటె మనిద్దరం ఒకర్నొకరు సూసుకోడాని క్కూడా సొసంతరం లేదన్నమాట! అంటూ విషాదంగా నవ్వాడు పుల్లయ్య.

'ఏం చేత్తాం మనకర్మ. నేను నిన్నుగాని, నువ్వు నన్నుగాని సూడ్డానికొత్తే ఆళ్ళకు గిట్టదు.' అంది మంగమ్మ విషాదంగా.

'ఆ సంగతి నీకెట్టా తెలుసు?'

'ఆ మాత్తరం తెలీదేంటి? నేనత్తమానం ఇంటికాణ్ణే వుంటాను గందా. ఆళ్ళమాటల్ని బట్టి తెలీదూ? మనిద్దరం కల్సుకున్నట్టు ఆళ్ళకు తెలిసిందో ఇక నేను నీకు నూరిపోత్తున్నాననో లేక నువ్వునాకు అన్నీ నేర్పుతున్నావనో ఇంకా ఏమేమో అంటారు,' అంది మంగమ్మ.

పుల్లయ్యకు నవ్వొచ్చింది.

'ఇదంతా తమాసాగా వుందిగదూ' అన్నాడు.

'ఇందులో తమాసాయేముంది నాబొంద!' అంది మంగమ్మ.

'తమాసాకాక మరేంటి! మొగుడూ పెళ్ళాలు యేరు యేరు ఇళ్ళల్లో వుండడం ఇంతవరకెక్కడైనా జరిగిందేటి? మొగుడూ పెళ్ళాలు ఒకరికొకరు నూరిపోయడం ఎవరూ ఎక్కడా కల్లో గూడా సూసివుండరు.'

కాసేపు మౌనం. ఎవరూ మాట్లాడలేదు.

తరువాత మంగమ్మ ఏదో గుర్తుకొచ్చిన దానిలా సర్లేగాని లేచి కాళ్ళూ, సేతులూ కడుక్కో...' అంది.

'ఎందుకూ...?' అని భార్య తెచ్చిన మూటవేపే చూస్తూ అన్నాడు పుల్లయ్య

''కాస్త పలారం పట్టుకొచ్చా తిందూ గాని..'' మూట విప్పుతూ అంది మంగమ్మ.

''ఏం తెచ్చావేటి?'' అంటూ పుల్లయ్య ఆత్రంగా మూటలోకి ఓసారి చూసి, లేచి మూలకున్న కుండలోంచి నీళ్ళు ముంచుకుని వాకిట్లోకి వచ్చి కాళ్లూ చేతులూ కడుక్కుని నోరు పుక్కిలించి మళ్ళీ యధాస్థానంలోకి వచ్చి కూర్చున్నాడు.

మంగమ్మ ఇంకా మూట విప్పుతూనే వుంది. ఒక పాత గుడ్డలో కట్టిన మూట అది. అది విప్పితె లోపల మరో గుడ్డమూట. అదీ విప్పింది. ఇలా నాలుగైదు మడతల్లో భద్రంగా కట్టితెచ్చిన ఫలహారం ఏమయి వుంటుందా? అని పుల్లయ్య దానివంకే ఆత్రంగా చూస్తూ కూర్చున్నాడు. చివరి కెలాగైతేనేం మంగమ్మ మూటవిప్పడం పూర్తిచేసింది అందులోంచి ఒకఆకులోచుట్టిన గారెలూ, మిఠాయి ఉండలూ పైకితీసింది.

''ఎవరూ సూడకుండా పట్టుకొచ్చినట్టు న్నావు గదూ?'' భార్యనే చూస్తూ అన్నాడు పుల్లయ్య.

మంగమ్మ గతుక్కుమంది. లోతుకు పోయిన ఆమె కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. ఒక్కనిమిషం తలవొంచుకుని నేలచూపులు చూస్తూ ఊరికే కూర్చుండి పోయింది.

తనామాట అనడం పొరపాటయిందేమో అనిపించింది పుల్లయ్యకు.

''ఛ! నేనట్టా అనలేదే యెర్రిమొకమా ఊరికే మాటవరసకన్నానంతె...'' అన్నాడు పుల్లయ్య ఆమెను సముదాయిస్తున్నట్టు.

కొంగు చివరతో కళ్ళు తుడుచుకుని 'నిన్న సందేల కోడలు ఇయన్నీ సేసింది. మొగుడు తినాలని సరదా పడినాడంట ... కాని నాకు మాత్తరం ఒక్కముక్కయినా గొంతు దిగనే దంటె నమ్ము ... నువ్వే గురుతుకొచ్చి గొంతులో ఏదో అడ్డు బడినట్టయిపోయింది. పొద్దున్నే అట్టుకొద్దామనుకున్నాను గాని అది సూత్తూండగా అట్టుకొచ్చే దయిర్యం నేక పోయింది. అందుకే ఇట్లా మసకసీకటీల ఎవరూ సూడకుండా అట్టుకొచ్చా...అయినా నా కర్మగాకపోతె నా సొంతి ట్లో నేనేదొంగ నయ్యేగతి పట్టింది సివరికి.అంతా నీమూలానే' అంది మంగమ్మ చివరి మాటను కాస్త రోషంగా నొక్కి పలుకుతూ.

పుల్లయ్య చివాలున తలెత్తి ''నేనేం జేసానే మద్దిన?'' అన్నాడు ఆశ్చర్యంగా.

'మరి నువ్వుగాక ఇంకెవరు జేసారేటి? నా కడుపున పుట్టిన ఆయెదవలిద్దరూ నన్నూ నిన్నూ అట్టా పంచుకుంటూంటె నువ్వేం దుకు నోరు మూసుకున్నావు మరి? నువ్వప్పుడు పట్టించుకునుంటె ఇప్పుడీ గతి పట్టుందేది గాదు గందా మనకు?''

నేను నోరు మూసుక్కూసున్నానా? అంతగా సెప్పినాను గందే...? అళ్ళు ఇనకపోతె నన్నేం సేయమంటావు సెప్పు...

"సెప్పినమాట ఇనకపోతే పట్టు బట్టు కూకోవల్సింది. మాకిద్దరికే ఓ వాటా పడేయండని నిలదీసి అడగాల్సింది" ఆవేశంగా అంది మంగమ్మ.

"అది కూడా అయిందిగా! కాని ఆ ఉద్దేశం ఆళ్ళ మనసుల్లోనే నేకపోతే నేను మాత్తరం ఏం సేయను సెప్పు? అళ్ళు నిన్నొకదూ, నన్నొకదూ తమకాడ వుంచుకుంటామంటె వూళ్ళోవాళ్ళు ఆళ్ళకేవత్తాసు పలికినారాయె. ముసలి కాలంలో మీకింతకంటె కావలిసిందేమిటి? అని నన్నే దబాయించినారయ్యే..."

"వూళ్ళో వాళ్ళదేం పోయిందనీ? పగలూ రాతిరీ సెంపటోడ్చి సంపాయించింది మనం. సివరికి మిగిలిందేటి? మనింట్లో మనమే పరాయి వోళ్ళ మయిపోయినాం" అంటూ ఉబికి వస్తున్న దుఃఖాన్ని ఆపుకోలేక మొహాన్ని చేతులతో కప్పేసుకుంది మంగమ్మ.

"పోన్లేయే, ఆళ్లు సల్లగా వుంటె అంతె సాలు. అయినా మనం మాత్నరం ఇంకెన్నాళ్ళుంటామని? అన్నాడు పుల్లయ్య భార్యను సముదాయిస్తూ.

"నీదేం పోయిందె? నువ్విక్కడ పొలంలో ఒక్కడివీ ఆయిగా వుంటావు... ఇంటికాడ జరిగేవన్నీ నీకేం తెలుస్తాయి. కోడలి సేత నానా మాటలూ పడుతూ ఇంటెడు సాకిరీ సేత్తూ సావలేక బకుకుతున్నాన్నేను" మళ్ళీ మంగమ్మ కళ్ళల్లో కాన్నీళ్ళు ధారలు కట్టాయి.

"అయినా నువ్వేం నయంలే ... పనిసేస్తె సేసావుగాని కొడుకు నీ కోడల్ని. పిల్లల్ని కళ్ళతో సూసుకుంటానైనా వుంటావు. నేను సూడు పొద్దస్తమానం ఒక్కణ్ణీ, బిక్కుబిక్కు మంటూ ఇక్కడ కూలబడి పొద్దు గడపాలి ... ఈ పొలంలోని ఆ ముసలి సెట్టుకీ, నాకూ తేడా ఏం తెలీదం లేదు" అన్నాడు పుల్లయ్య.

మరి ఇంటికాడుండకుండా ఈడ ఈ పాకలో ఎందుకుంటున్నావు? అంది మంగమ్మ.

"ఏం జేయను మరి? ఇంట్లో కూసునుంటే నేమో నీ రెండో కోడలు ఒకటే సణుగుడు. కూసుని తింటాడో అని వూరంతా గోలెడుతుంది. ఈడికొచ్చి కూసుంటె కూడు పంపడానికి వస్తుంది

కానేపు తనలో తనే ఆలోచించుకున్న మంగమ్మ చివరికి ఏదో స్పురించినదానిలా పోని ఇట్టా నేస్తేనో? అంది.

"ఎట్టా? కుతూహలంగా అడిగాడు పుల్లయ్య.

మనిద్దరం వేరే కాపురం పెడదాం.

పుల్లయ్య ఆమె మాటకి నవ్వేశాడు.

వేరే కాపురం పెట్టుకోవచ్చుగాని మన కొడుకు లిద్దరూ ఒప్పుకోవద్దూ?

అళ్ళొప్పుకోకపోతే ఏమవుతుందేటి? మనమే వుందాం.

"అళ్ళు మనకేమీ ఇయ్యకపోతేనో?

ఇయ్యకపోతె పోని ఏవన్నా కూలో నాలో సేసుకుని బతుకుదాం.

ఏంటీ? ఈ వయసులో కూలీ పని సేత్తావా నువ్వు? అయినా నీ పిచ్చగాని పండు టాకులమయిపోయిన మనకు పనెవడిత్తాడే?

అయితే ఎంత కాలం ఇట్లాగ వుందామంటావు మరి?

వుండక సేసేదేముంది సెప్పు. అయన్నీ జరిగేవి కాదు అన్నాడు పుల్లయ్య.

మంగమ్మకు మొగుడి మీద చాలా కోపం వచ్చింది. చిరాకూ వేసింది ఇంకేం మాట్లాడలేక మౌనంగా కూర్చుండి పోయింది.

ఆమె మొహంకేసే చూస్తున్న పుల్లయ్య భార్యకు కోపం వచ్చిందని తెలుసుకున్నాడు.

లేని నవ్వును మొహం మీదికి తెచ్చుకుంటూ ఇంతకీ నాకు ఫలారం పెట్టేదేమైనా వుందా లేదా అని అడిగాడు.

నిజంగా చూస్తే అక్కడికి వచ్చినప్పుడున్న ఉత్సాహం మంగమ్మలో ఏ మాత్రం మిగల్లేదప్పుడు అయినా తనిక ఏం చెప్పినా ప్రయోజనం లేదని గ్రహించి మూట నుంచి గారెలు తీసి మొగుడి ముందుంచింది.

ఒక గారె ముక్క తుంచుతూ "నువ్వు తినవా?" అని అడిగాడు పుల్లయ్య.

నా కొద్దు.

ఎందుకు?

నేను రాతిరే తిన్నాను గందా?

తింటే యేంటే రాతిరి తింటె ఇప్పుడు తినకూడదని లేదుగా?

పుల్లయ్య చేతిలో ముక్కనలాగే పట్టుకుని భార్య మొహంలోకే చూస్తూ కూర్చున్నాడు

ఎంత సేపు చూసినా ఆమె తినకపోవడంతో "తొరగా తినుమరి అన్నాడు.

నా కొద్దని సెప్పాగా.

నువ్వు తింటేనే నేను తినేది అని పట్టుబట్టాడు పుల్లయ్య.

మంగమ్మ మొహంలో నవ్వు మెరిసింది.

యేంటి నువ్వు మరీను సిన్నపిల్లాళ్ళ సేత్తున్నావు అని చిరుకోపంతో వూరికే కసిరినట్టు అంది మంగమ్మ.

సిన్నపిల్లాడె అనుకో ఇంకోటె అనుకో గాని నువ్వు నాతో తినంటే నేను మాత్నరం తినను గాక తినను. అంటూ పుల్లయ్య మొండికేశాడు

ఎవరైనా చూస్తే యేమనుకుంటారు సెప్పు మొహమాట పడుతున్న దానిలా పాక బయటికి దృష్టి సారించింది మంగమ్మ.

ముసలి సరదా అనుకుంటారు అంతేగా.

ముసలి సరదా అనుకుంటారో, ఇంకేటనుకుంటారో? అంటూ ముసి ముసిగా నవ్వుతూ తానూ ఒక ముక్క తుంచి నోట్లో పెట్టుకుంది మంగమ్మ.

అప్పుడు తృప్తి కలిగినట్టు నవ్వి పుల్లయ్య తాను కూడా తినసాగాడు.

"ఎన్నాళ్ళయిందో మనిద్దరం ఇట్టా ఒక సోట కూసుని ఒక్కసారే తిని! ఎప్పుడు తిన్నామో గుర్తుందా నీకు? ఏవో పాత జ్ఞాపకాలు గుర్తుకు తెచ్చుకుంటున్నవాడిలా అన్నాడు పుల్లయ్య.

ఏమో నాకైతె గుర్తునేదు.

నాకు బాగా గుర్తుంది. మన పెద్దోడు పుట్టిన యేడాదికి నేనేదో పని మీద పొరుగూరెల్లి పొద్దు పోయింతర్వాత తిరిగొచ్చాను. నువ్వేమో నా కోసం కనిపెట్టుకుని కూడు తినకుండా కూసున్నావు. నేను రాంగానే నాకు కూడెడుతూంటె నువ్వు తినమని అన్నాన్నేను. ఎంతో బతిమాలితే అప్పుడు నాతో బాటు కూడు తినడానికి ఒప్పుకున్నావు. సిగ్గు పడుతూ మొహమాట పడుతూ నువ్వట్టా నా యెదుట కూసుని తింటూంటె నాకెంత సంబరమేసిందో తెలుసా. తరువాత ఇంకో సంగతి అదీ గుర్తు లేదూ?

"ఏ సంగతి?"

అదే తింటూ తింటూ నేన్నీకు ముద్ద నోట్లో బెడితే, పుల్లయ్య చెబుతూ ఓరగా భార్య మొహంలోకి చూశాడు.

మోకాళ్ళలో మొహం చాటు చేసుకుంటూ "పోదూ ఇట్టాంటివన్నీ సెప్పుకుంటా రేటి? అని సిగ్గుపడి పోయింది మంగమ్మ.

కొత్త పెళ్ళి కూతురిలా ఇప్పుడు సిగ్గేటీ నీకు? గుర్తులేవనావని గుర్తు చేసానంతే!! నవ్వుతూ అన్నాడు పుల్లయ్య.

"గుర్తులేవని అన్నానా నేను?"

మరెందుకు సెప్పలేమూ?

ఇట్టాంటివన్నీ మనసులో భద్రంగా దాని పెట్టకోవాలగాని పైకి సెప్పుకుంటా రేటి అంది మంగమ్మ.

"అమ్మో! నవ్వుగూడా బలే వున్నావే? ఏటో అనుకున్నాను..." మెచ్చుకోలుగా చూస్తూ అన్నాడు పుల్లయ్య.

మంగమ్మ మొహం అలా చాటుపెట్టుకునే నవ్వసాగింది.

పుల్లయ్య రెప్పవేయకుండా ఆమెకేసే చూస్తూ కూర్చున్నాడు

తినడం పూర్తికాగానే మంచినీళ్ళు తాగి తృప్తిగా త్రేన్చాడు పుల్లయ్య

"ఇట్టాంటివన్నీ తిని శానాళ్ళయిందే మంగా..."

మంగమ్మ మాట్లాడలేదు. కాస్సేపు అలాగే కూర్చుండిపోయి ఆ తరువాత తను తెచ్చిన గుడ్డలమూటను సర్దుకుంటూ "నేనె ళ్ళనా మరి?" అంది.

"అప్పుడేనా?" పుల్లయ్య మొహం దిగులుగా మారిపోయింది. "యెల్లువగాని ఇంకా సేపు కూసోవే?"

"అట్టాకుదరదు మరి ఎక్కువ సేపయితే లేనిపోని గొడవలన్నీ వచ్చిపడతాయి మావా..."

"మళ్ళీ ఏప్పుడొత్తావ్?" ఉత్కంఠతతో అడిగాడు పుల్లయ్య.

మంగమ్మకు గొంతు జీరవోయింది. కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. మూటపట్టుకుని మొహం అటుతిప్పుకున్ని "వస్తాలే... ఇట్టాగే ఎప్పుడైనా..." అంది లేచి నిలబడి.

మంగమ్మ కర్ర అందుకుని వచ్చిన దారినే వెనక్కి బయలుదేరింది.

ఆమె తననుంచి అలా దూరంగా వెళ్ళిపో తుంటే ఒంటరిగా మిగిలిపోయిన పుల్లయ్య దిగులుగా చూస్తూ వుండిపోయాడు. ◆

## రచయితలు గమనించాలి...

ప్రజాతంత్రలో ప్రచురణకు స్వీకరించబడని రచనలు, తగిన పోస్టేజి జతపరిచినా తక్షణమే త్రిప్పిపంపడం సాధ్యపడదు. రచనల పరిశీలనకు కనీసం రెండు నెలలు వ్యవధి అవుసరమవుతుంది. ఈ విషయంలో ఉత్తర ప్రత్యుత్తరాలకు కూడా అవకాశం వుండదు. సమాధానాలకోసం కార్డులు, ఇన్‌ల్యాండ్ కవర్లు పంపనవసరం లేదు. రచయితలు గ్రహించవలసిందిగా కోరుతున్నాం.

—ఎడిటర్